

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 వరంగల్
ఆదివారం 15 సెప్టెంబరు 2024


దేవాదుల సొరంగం


నేటికీ చెక్కుచెదరని ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు

మన మేధస్సు.. అద్భుతం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనలు, భారీ ప్రాజెక్టుల వరకు అన్నింటిలోనూ ఇంజనీర్లే కీలకం
- దేవాదుల ప్రాజెక్టులో 49.6కి.మీ.ల టన్నెల్ ఓ రికార్డు
- 506 మీటర్లపైకి కొండపోచమ్మ వరకు నీటిని లిఫ్ట్ చేసేలా కాళేశ్వరం డిజైన్
- చెక్కుచెదరని నిజాంకాలం నాటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు
- మేడారం జంపన్నవాగుపై 37రోజుల్లో వంతెన నిర్మాణం మరో రికార్డు
- ఇప్పటికీ అంతుచిక్కని కాకతీయుల నాటి కళా నైపుణ్యం


ప్రపంచ వారసత్వ సంపదగా వెలుగొందుతున్న రామప్ప దేవాలయం

5 నేడు ఇంజనీర్స్ డే


కాళేశ్వరం ప్రాజెక్టు

Sunday Special

కాకతీయుల కాలమైనా.. ప్రస్తుతమైనా.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నో అద్భుత కట్టడాలకు నిలయం. గొలుసు కట్టు చెరువుల నుంచి నీటిని ఎత్తిపోసే నేటి తరం ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. వీటికి తోడు ఎప్పటికీ అంతుచిక్కని ఎన్నో రహస్యాల సమాహారమైన ఆలయాలు ఉన్నాయి. ఓ వైపు భూగర్భంలో అనకొండల్లా కిలోమీటర్ల కొద్ది సాగిపోయే సొరంగాలు.. మరోవైపు శిల్పకళా శోభిత ఆలయాల కట్టడాలను చూస్తే కళ్లు చెదురుతాయి. ఆహా.. ఈ ఇంజనీరింగ్ నైపుణ్యం అమోఘం అనడం ఖాయం. కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిస్తే.. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్‌తో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహాద్భుతంగా అభివర్ణిస్తున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలవటం నాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. ఇలా ఎన్నో విశిష్ట కట్టడాల సమాహారమైన ఓరుగల్లు నిర్మాణాల్లో ఇంజనీరింగ్ నిపుణుల నైపుణ్యం చెక్కుచెదరనిది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలి

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 14: ఉచిత చేప విత్తనాలకు బదులు నగదు బదిలీ చేయాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డిమాండ్ చేసింది. శనివారం ములుగురోడ్‌లోని మత్స్య సహకార భవన్‌లో వరంగల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గ సమావేశం చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగింది. మత్స్యకారుల సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలను ఏకగ్రీవంగా తీసుకున్నారు.

ప్రభుత్వం 50శాతం చేప పిల్లలను చెరువులో పోయాలని నిర్ణయించిందని, కానీ, గత ప్రభుత్వ మాదిరిగా 100శాతం పోయాలని తీర్మానించారు. అలాగే భారీ వర్షాలతో జిల్లాలో చెరువులలో ఉన్న పాత చేపలు దిగువకు పోవడంతో భారీ నష్టం వాటిల్లిందని, దీంతో ప్రభుత్వం ఆదుకోవాలని, పాత పద్ధతిలోనే సభ్యత్వాలను తీసుకోవడం జరుగుతుందని, ఉచిత చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పొన్నం మొగిలి, కంబాల కోటి, రామేశ్వర్, చెవ్వు కాశీనాథం, అల్లాడి నర్సయ్య, దామ సాంబయ్య, చింతకాయల నరేందర్, జిల్లా కార్యదర్శి నీరటి సదానందం పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్యవర్గం

నర్సంపేట ఎమ్మార్సీలో సిబ్బంది గైర్హాజరు

అసహనం వ్యక్తం చేసిన డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14: జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ ఆకస్మిక తనిఖీలకు తెరతీశారు. శుక్రవారం నెక్కొండ మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులను గుర్తించి రోజు గడవక ముందే శనివారం నర్సంపేటలోని ఎమ్మార్సీని ఆకస్మికంగా తనిఖీ చేయగా కార్యాలయంలో ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు గైర్హాజరైన విషయాన్ని గుర్తించారు. దీంతో విద్యాశాఖలో పనిచేస్తున్న కొంత మంది సిబ్బంది పనితీరుపై డీఈవో అసహనం వ్యక్తం చేశారు. నెక్కొండకు, నర్సంపేటకు ఒక్కరే ఇన్‌చార్జీ ఎంఈవోగా ఉన్నారు. పనితీరును మార్చుకోవాలని ఎంఈవోను హెచ్చరించారు. ఎమ్మార్సీలోని రికార్డులను డీఈవో తనిఖీలు చేయగా ఇన్‌వార్డ్, ఔట్‌వార్డ్ పుస్తకాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు గుర్తించారు. ఎంఈవో నిర్లక్ష్య ధోరణి, వైఫల్యంపై మండిపడ్డారు. మధ్యాహ్న భోజన బిల్లులకు సంబంధించిన సమాచారం కోసం ఆరా తీయగా వివరాలు కంప్యూటర్ ఆపరేటర్ వద్ద ఉంటాయని తెలుసుకొని విస్మయం వ్యక్తం చేశారు. కంప్యూటర్ ఆపరేటర్‌పై ఆరా తీయగా అతడు ఆఫీస్‌కు సరిగా రాడని డీఈవో గుర్తించారు. సమాచారం లేకుండా గైర్హాజరైన ఆపరేటర్, మెజెంజర్‌లపై చర్యలు తీసుకోవాల్సింగా ఎంఈవోను ఆదేశించారు. అనంతరం నర్సంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉన్న సంగతి గమనించిన డీఈవో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు.


నర్సంపేట ఎమ్మార్సీలో వివరాలు సేకరిస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు, సెప్టెంబరు 14: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమం సమావేశం పున్నేలు సత్యం గార్డెన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ సభ్యత్వ ప్రముఖ్ మల్లాడి తిరుపతిరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, మండలస్థాయిల్లో ప్రజాప్రతినిధులను గెలిపించుకుంటేనే పార్టీ బలం పెరుగుతుందన్నారు. సభ్యత్వ నమోదును అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

సభ్యత్వ నమోదు చేసుకోవాలి..: గంట

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధిలో ప్రజాసంక్షేమంలో ప్రథమ స్థానంలో మోదీ ప్రభుత్వం నిలుపుతోందన్నారు. కార్యకర్తలంతా కష్టపడి సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదు కోసం 88000 02024 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి మీ వివరాలు పొందుపరిచి బీజేపీ సభ్యులు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి పాపారావు, జిల్లా సభ్యత్వ సహప్రముఖ్ కుసుమ సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకుడు రంజిత్‌కుమార్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు బన్న ప్రభాకర్, కాజీపేట దర్గా సొసైటీ అధ్యక్షుడు వనంరెడ్డి, మల్లారెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ జక్కు రమేష్‌గౌడ్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏకాంతం గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సునీత, మజ్జిగ జయపాల్, జడ సతీష్, వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజు, మండల, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వందేభారత్ పరుగులు

రేపటి నుంచి కాజీపేట మీదుగా నాగపూర్ రాకపోకలు

కాజీపేట, సెప్టెంబరు 14: ఈ నెల 16 నుంచి కాజీపేట మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడవనుంది. ఇందుకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నాగ్‌పూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20101) రైలు ఈనెల 16న నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి కాజీపేట 10.04 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు 12.15 నిమిషాలకు చేరుకుంటుంది. తిరిగి సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 3.20 నిమిషాలకు చేరుకుంటుంది. రాత్రి 8.20 నిమిషాలకు నాగ్‌పూర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వైద్య విద్యకు రెడీ


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

హాజరుకానున్న మంత్రులు : కలెక్టర్, ఎమ్మెల్యే

నర్సంపేట, సెప్టెంబరు 14: నర్సంపేట పట్టణ శివారులో నిర్మించిన జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నూతన భవనాన్ని ఈనెల 17న ప్రారంభించనున్న నేపథ్యంలో నూతన భవనాన్ని పరిశీలించి, ఏర్పాట్లను కలెక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులతో కలిసి శనివారం పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆస్పత్రి, వైద్య కళాశాల భవనం ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 50మంది వైద్య విద్యార్థులకు సరిపడేలా ప్రొఫెసర్లు, ఇతర సిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఆర్డీవో కృష్ణవేణి, డీసీపీ రవీందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత పాల్గొన్నారు.

- మంత్రులు రాక సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే హెలిప్యాడ్ స్థలాన్ని శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నర్సంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్‌నాయక్, కౌన్సిలర్ వేముల సాంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

17న వైద్య కళాశాల భవనం ప్రారంభానికి ఏర్పాట్లు

ఎటూ తేలని ఆంధ్ర, తెలంగాణ స్థానికత

ఇంకా భర్తీకాని 43 స్థానిక సీట్లు

30 వరకు కౌన్సెలింగ్ ద్వారా భర్తీ అయ్యే అవకాశం

నర్సంపేట, సెప్టెంబరు 14 : నర్సంపేటలో ఈ విద్యా సంవత్సరం నుంచే మెడికల్ కళాశాలలో వైద్య విద్య బోధన అందుబాటులోకి రానుంది. పట్టణంలోని సర్వాపురం శివారు దామెరచెరువు సమీపంలో ఏడాదిన్నర క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.183 కోట్లతో వైద్య, జిల్లాస్థాయి ఆస్పత్రి భవన నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. కళాశాల భవనాన్ని ఈనెల 17న ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరనర్సింహ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనుసరి అనసూయ (సీతక్క) హాజరు కానున్నారు. ప్రభుత్వం అందించిన నిధులతో భవన నిర్మాణంతోపాటు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. విద్యార్థుల వసతి గృహాలతోపాటు తరగతి గదులు, ఇతర విభాగాల గదుల నిర్మాణాలను పూర్తి చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 50 ఎంబీబీ ఎస్ సీట్లతో మెడికల్ కళాశాల ప్రారంభం కానుంది. ఇప్పటికే 16 మంది ప్రొఫెసర్లు, 20మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 22మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు.



తేలని స్థానికత

ఆంధ్ర, తెలంగాణ స్థానికత తో తెలంగాణ కోట కింది 43 లోకల్ సీట్లు ఇప్పటికీ భర్తీ కాలే దు. ఆంధ్ర, తెలంగాణ స్థానికత కొలిక్కి వచ్చి సెప్టెంబరు 30 వరకు మరో రెండు కౌన్సెలింగ్‌ల ద్వారా 43మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందడానికి అవకాశాలు ఉన్నాయి. అడ్మిషన్లు పూర్తిచేసి అక్టోబరు 1నుంచి వైద్య విద్య తరగతులను ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. వైద్య కళాశాల ప్రారంభమయ్యాక అందులో పనిచేసే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, కాంట్రాక్టు పద్ధతిలో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు జిల్లా వైద్య ఆస్పత్రిలో కూడా విధులు నిర్వహించనున్నారు. పారా మెడికల్ సిబ్బంది నియామకం జరగలేదు. జిల్లా ఆస్పత్రిని ప్రారంభించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేశారు.



1 నర్సంపేట వైద్య కళాశాలకు 50సీట్లు కేటాయించారు. ఇందులో ఏడుగురు నాన్‌లోకల్ విద్యార్థులకు అవకాశం కల్పించగా, రాష్ట్ర కోటా కింద 43సీట్లను కేటాయించారు. అయితే ఇప్పటి వరకు ఏడు నాన్‌లోకల్ సీట్లలో కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే కళాశాలలో చేరారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

- సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- డీన్ మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14: కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు పీజీ అభ్యర్థులంతా ఇక నుంచి తప్పనిసరిగా యూజీసీ సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణను తప్పనిసరి చేయనుంది. దేశవ్యాప్తంగా న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పీహెచ్‌డీ అడ్మిషన్లకు జాతీయ అత్యున్నత సంస్థ నిర్వహించే నెట్ పరీక్షలు తప్పనిసరి చేసింది. దేశవ్యాప్తంగా యూజీసీ గుర్తింపు పొందిన వర్సిటీలన్నింటికీ మార్గదర్శకాలను రూపొందించింది. తమ ఆదేశాల మేరకు అన్ని వర్సిటీలు పీహెచ్‌డీ అడ్మిషన్లలో ప్రత్యేక ప్రవేశ పరీక్షలు రద్దు చేసి సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత మేరకు సీట్లు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ మార్గదర్శకాల నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు విధి విధానాలు రూపొందించేందుకు కేయూ సోషల్‌సైన్స్ డీన్ తాళ్లపల్లి మనోహర్, చైర్మన్‌గా జియాలజీ విభాగాధిపతి మల్లికార్జున్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డీన్ ఎం సదానందం, అకాడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కమిటీ ఇప్పటికే యూజీసీ నిబంధనలు ఏమీ చెబుతున్నాయి. మార్గదర్శకాలు ఏవిధంగా రూపొందించాలనే అంశంపై చర్చించింది.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్ రద్దు

కేయూ ప్రత్యేకంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఎలాంటి ఎంట్రెన్స్ నిర్వహించదు. జాతీయ స్థాయి జేఆర్ఎఫ్ అభ్యర్థులకు అన్ని విభాగాల్లో మొట్టమొదటి ప్రాధాన్యత కల్పించి అడ్మిషన్లు కల్పిస్తారు. జేఆర్ఎఫ్ తర్వాత నెట్ ఉత్తీర్ణతలో వచ్చిన మెరిట్ మేరకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఏడాదికి రెండు దఫాలుగా జాతీయస్థాయిలో నెట్ పరీక్షలు జరుగుతాయి. నెట్ పరీక్షల ఫలితాలు రాగానే అర్హులైన అభ్యర్థులు నేరుగా దరఖాస్తులు చేసుకుంటే అడ్మిషన్లు కల్పించే వీలుంది. అభ్యర్థులు ప్రత్యేకంగా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. నెట్ పాసైన వెంటనే అడ్మిషన్లు పొందవచ్చు.

జేఆర్ఎఫ్, నెట్‌కు కుస్తీ పట్టాల్సిందే..

జాతీయస్థాయిలో ప్రతీ సబ్జెక్టులో నెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో రెండు పేపర్లుంటాయి. మొదటి పేపర్ జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ పరిజ్ఞానం, ప్రాథమిక గణిత సామర్థ్యాలు, లోక పరిజ్ఞాన అంశాలుంటాయి. మొదటి పేపర్‌లో అర్హులైన అభ్యర్థుల రెండో పేపర్‌ను వాల్యూయేషన్ చేస్తారు. రెండో పేపర్ మొత్తం సంబంధిత అభ్యర్థి ఎంచుకున్న అంశంలో ఉంటుంది. సైన్స్ అభ్యర్థులకు సీఎస్ఐఆర్ అని, ఆర్ట్స్, సోషల్ సైన్స్ ఇతర సబ్జెక్టుల అభ్యర్థులందరికీ నెట్ పరీక్షలని పిలుస్తారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో ఏడాదికి రెండు దఫాలుగా యూజీసీ సీఎస్ఐఆర్, నెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. పీజీ ఫైనలియర్‌లో ఉన్న అభ్యర్థులను కూడా నెట్, సీఎస్ఐఆర్ ప్రవేశ పరీక్షలకు అనుమతిస్తారు. జేఆర్ఎఫ్‌కు వయసు పరిమితి విధించారు. నెట్ ఉత్తీర్ణతకు మాత్రం ఎలాంటి వయసు పరిమితి ఉండదు. ఉత్తీర్ణులయ్యే వరకు పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించారు. నెట్ పరీక్షల కోసం కేయూలో ఉచితంగా కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కొత్త వీసీ రాగానే నోటిఫికేషన్

యూజీసీ నిబంధనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం రూపొందించిన విధి విధానాల నోటిఫికేషన్ కొత్త వీసీ రాగానే జారీ కానుంది. యూజీసీ నిబంధనలన్నీ ఉన్నది ఉన్నట్లుగా అడాప్ట్ చేసుకునే అధికారం వీసీకి ఉంది. రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు నూతన వీసీలను నియమిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. వీసీలు రాగానే యూజీసీ పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రక్రియకు అధికారికంగా పచ్చజెండా ఊపుతారని వర్సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి.

పురుగుల మందు తాగిన వృద్ధురాలి మృతి

డోర్నకల్, సెప్టెంబరు 14 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్‌లోని లచ్యాతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. లచ్యాతండాకు చెందిన తేజావత్ బీబు (60) సుబాష్ వీధిలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి లింగంపల్లి రాజేష్ ఇంటిలో పనిచేస్తుంది. ఈనెల 13న రాజేష్ ఇంటిలో రోజువారి పనులు ముగించుకుని తన ఇంటికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం మళ్లీ రాజేష్ ఇంటికి రాగా ఇంట్లో ఉన్న రూ.15 వేలు నగదు పోయిందని, ఆమె తీసిందని ఆవేశంతో రాజేష్, అతడి భార్య అమల బీబుపై చేయి చేసుకున్నారు. మనస్తాపం చెందిన బీబు ఇంటికి వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు రమేష్ బీబును చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ బీబు మృతి చెందింది. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిన్నెల వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

బయ్యారం, సెప్టెంబరు 14 : వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నామాల పాడు పంచాయతీ ధర్మాపురానికి చెందిన పూనెం వెంకన్న (45) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని భార్య శృతితో చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. అనంతరం ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు వెతక సాగారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలోని జిన్నెల వాగు ఒడ్డున వెంకన్నకు సంబంధించిన చెప్పులు, టవల్ కనిపించడంతో ప్రమాదవశాత్తు వెంకన్న వాగులో గల్లంతై ఉంటాడనే అనుమానంతో రెండురోజుల పాటు గజ ఈతగాళ్లతో వెతికించారు. శనివారం వెంకన్న మృతదేహం లభ్యమైంది. మృతురాలి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.



కుడా చైర్మన్ వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

కళాకారులకు గుర్తింపు ఇవ్వాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: హనుమకొండలో ప్రారంభమయ్యే కాళోజీ కళాక్షేత్రంలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాసంస్థలకు ఉచితంగా ఇవ్వాలని తెలంగాణ నాటక కళా సమితి నాయకులు, కళాకారులు శనివారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కుడా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆడిటోరియంలో కళాకారులు మేకప్ చేసుకునేందుకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్, స్టేజీ డెకరేషన్, గ్రీన్‌రూమ్, రిహార్సల్స్ గదులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, కాకతీయ నాటక కళాపరిషత్ జిల్లా అధ్యక్షుడు రాదారపు సంజీవరెడ్డి, కళాకారులు చక్రపాణి, బాలాజీ, రమేష్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, బిక్షపతి, శంకర్, గణేశ్‌తో పాటు కళాకారులు పాల్గొన్నారు.

నిమజ్జన వేళ.. మద్యం షాపులు బంద్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఈనెల 16వ తేదీ ఉదయం 6గంటల నుంచి 17వ తేదీ ఉదయం 6గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు మద్యం షాపులు బంద్ చేయాలన్నారు. మద్యం సరఫరా చేసే బార్‌లు, క్లబ్‌లు, హోటళ్లు మూసివేయాలని అంబర్ కిషోర్‌ఝా సూచించారు. ఎవరైనా మద్యం షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు ఆకాశవాణిలో ఎంపీ కావ్యతో ముఖాముఖి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: వరంగల్ ఆకాశవాణి ఎఫ్ఎం బ్యాండ్ 103.5 మెగా హెడ్జ్‌పై ఆదివారం ఉదయం 7.15నిమిషాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్యతో ముఖాముఖి కార్యక్రమం ప్రసారం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు ఇల్లెందుల రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడియం కావ్య జీవన ప్రయాణంలో అనేక విషయాలు.. అనే అంశంపై ప్రసారం ప్రారంభం అవుతుందని తెలిపారు.

తైక్వాండోలో శశాంక్‌కు కాంస్యం

న్యాశాయంపేట, సెప్టెంబరు 14: తమిళనాడులో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో న్యాశాయంపేటకు చెందిన గుజ్జేటి త్యాగరాజు కుమారుడు శశాంక్ కాంస్య పతకం సాధించాడు. శనివారం టోర్నీ నిర్వాహకుల నుంచి శశాంక్ కాంస్య పతకం అందుకున్నాడు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శశాంక్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్ వీ నరసింహ పర్యవేక్షణలో 6 నెలలు శిక్షణ తీసుకున్నాడు.



నిర్వాహకుల నుంచి కాంస్య పతకం తీసుకుంటున్న విద్యార్థి శశాంక్

మన మేధస్సు.. అద్భుతం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ ఇంజనీర్లే కీలకం
- నేడు ఇంజనీర్స్ డే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కళ్లు చెదిరే ఎన్నో కట్టడాలకు నెలవు ఉమ్మడి వరంగల్ జిల్లా. కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువుల నుంచి ఈ తరం వారు నిర్మించిన ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. అంతేకాదు ప్రపంచాన్ని సైతం అబ్బురపరిచే ఆలయాల నిర్మాణం, దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్ నిర్మాణంతో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహా అద్భుతంగా చెబుతున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికి చెక్కు చెదరకుండా నిలవటం ఆనాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. అంతేకాదు కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిచింది.

అసియాలోనే అతిపెద్ద టన్నెల్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయనిగా భావించే దేవాదుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ అద్భుతంగా చెబుతారు. 2003లోనే మన ఇంజనీర్లు రూపొందించిన దేవాదుల ఎత్తిపోతల పథకానికి అసియాలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పేరుంది. మూడు దశలుగా విభజించి నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాదంతా నీటిని ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. సుమారు 6లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఈ దేవాదుల ప్రాజెక్టులో భాగంగా మూడవ దశలో టన్నెల్‌ను నిర్మించారు. ఈ అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలో మీటర్ల వరకు నిర్మించారు. ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ వందలాది మంది ఇంజనీర్ల కృషితో విజయవంతంగా సుదీర్ఘకాలం పాటు టన్నెల్ నిర్మాణం సాగింది. ఈ సొరంగం నుంచి దేవాదుల ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలించనున్నారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న బావితరహాలో నిర్మించగా, 141 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన పంపుహౌస్ కూడా ఓ రికార్డే. ఇంత పెద్ద సొరంగం నిర్మాణాన్ని డిజైన్ చేసిన ఇంజనీర్ల ప్రతిభను ప్రశంసించని వారు లేరు. టన్నెల్ పనులు ఆలస్యమైనా ఇంత పెద్ద సొరంగాన్ని తవ్వి గోదావరి జలాలను తరలించటం సాధారణ విషయం కాదనే చర్చ ఉంది. ఇందులో వినియోగించిన యంత్రాలు విదేశీవే అయినప్పటికి మేదస్సు మాత్రం మన ఇంజనీర్లదే కావడం విశేషం.

ఇచ్చంపల్లి... అచ్చాహై..

నిజాం కాలంలోనే అప్పటి హైదరాబాద్ రాష్ట్రంతో పాటు



మేడారం జంపన్న వాగుపై నిర్మించిన జంట వంతెనలు

మధ్యప్రదేశ్, మహారాష్ట్రల సాగు, తాగు నీరు, విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై ఈ భారీ ప్రాజెక్టుకు నిజాం సర్కారు శ్రీకారం చుట్టింది. 1860లోనే ఫ్రెంచ్ దేశానికి చెందిన 30మంది ఇంజనీర్ల సహకారంతో హైదరాబాద్ ఇంజనీర్లతోపాటు 3వేల మందికి పైగా కూలీలు ఈ ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెంది పనులు చేస్తున్న 20ఫ్రెంచ్ ఇంజనీర్లు, 2వేల మందికి పైగా కూలీలు మృత్యువాత పడ్డారు. దీంతో ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అయితే వందేళ్లు దాటిన ఇప్పటికి ఇచ్చంపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న నాటి కట్టడాలు చెక్కుచెదరలేదు. గోదావరిలో రాళ్లతో నిర్మించిన తాత్కాలిక రోడ్డు ఇంకా పటిష్ఠంగానే ఉంది. ఛత్తీస్‌గఢ్ వైపు చేపట్టిన బండ్ ఇంకా బలీయంగా కనిపిస్తుందంటే నాటి ఇంజనీరింగ్ తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

జంపన్నవాగుపై వంతెన ఓ అద్భుతం..

మేడారం జాతరలో 2002కు ముందు జంపన్నవాగుపై ఎలాంటి వంతెనలు లేవు. దీంతో భక్తులు వాగు దాటి జాతరకు వచ్చేవారు. తాత్కాలికంగా పైపుల అమర్చి, వాటిపై ఇసుక బస్తాలను వేసి రోడ్డు వేసేవారు. అయితే 2002లో టీడీపీ హయాంలో అప్పటి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రూ.1.89కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో నక్సలైట్ల నుంచి బెదిరింపులు వచ్చినా తట్టుకుని ఇంజనీర్లు మేడారం అడవుల్లోనే మకాం వేసి 37రోజుల్లో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. అతితక్కువ కాలంలో ప్రతికూల పరిస్థితుల్లో ఇంజనీర్లు తమ ప్రతిభ చాటారు. 2014లో మరో వంతెనను ఇంజనీర్ల చాలెంజ్‌గా తీసుకుని దాన్ని కూడా 37రోజుల్లోనే పూర్తి చేసి మొదటి వంతెన రికార్డును సమం చేశారు. మన ఇంజనీర్ల కృషితో నిర్మాణమైన జోడు వంతెనలు మహాజాతరకు వన్నె తెస్తున్నాయి.

నేడు ఇంజనీర్స్ డే

ఏటా సెప్టెంబరు 15న ఇంజనీర్స్ డే జరుపుకొంటారు. తొలి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్నాటకలోని ముద్దెనహళ్లిలో 1861 సెప్టెంబరు 16న జన్మించారు. మైసూరు దివాన్‌గా 1912 నుంచి 1919 వరకు పని చేశారు. దేశంలో అనేక నదులపై వంతెనలు, ఆనకట్టలను నిర్మించి నీటిపారుదల, తాగునీరు పథకాల ద్వారా జలవనరులను సద్వినియోగానికి కృషిచేసిన ఆయనకు కర్ణాటకలోని కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మాణం పేరు తెచ్చింది. ఇక ఆయన హైదరాబాద్ డ్రెయినేజీ వ్యవస్థకు రూపకల్పన చేశారు. విశాఖపట్నం పోర్టు సముద్రం వల్ల కోతకు గురికాకుండా చేయగలిగారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గౌరవిస్తూ ఏటా ఆయన జయంతి రోజున ఇంజనీర్స్‌డేగా జరుపుకొంటున్నారు.

ప్రపంచంలోనే గొప్ప డిజైన్ కాళేశ్వరం సొంతం

కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుత నిర్మాణం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణ ఇంజనీర్ల నైపుణ్యం.. మేధస్సు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఉన్న ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టును తెలంగాణ ఇంజనీర్లు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తున్న ప్రాణహిత నది నీటిని మళ్లించేలా ఈ రీ డిజైన్ జరిగింది. సముద్ర మట్టానికి మేడిగడ్డ 100 మీటర్ల ఎత్తులో ఇది ఉండగా.. ఇక్కడి నుంచి 624మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని ఎత్తిపోయాలి. అంటే సుమారుగా ఆర కిలో మీటర్‌కు పైగా ఎత్తుకు నీటిని ఎత్తిపోసేలా కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇది సాగునీటిరంగంలోనే ఓ గొప్ప ఆవిష్కరణగా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలు, ఇతర కారణాలపై ఆరోపణలు, విమర్శలు ఉన్నా మన ఇంజనీర్ల పనితీరు మాత్రం అద్భుతమనే చర్చ ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ సవాల్‌గా తీసుకున్న ఇంజనీర్లు ప్రాజెక్టు పూర్తి చేయటమే లక్ష్యంగా కుటుంబాలను కూడా వదిలి పనిచేశారు. ఎండ, వాన, చలి, రాత్రి, పగలు అనేది లేకుండా మూడు షిఫ్టుల్లో పనులు చేశారు. ఇంటి వద్ద ఎవరికైనా అనారోగ్యం వచ్చినా 'ఎలాగోలా అడ్జెస్ట్ చేసుకోండి. ఇక్కడ పని బాగా ఉంది. అర్థం చేసుకోండి' అంటూ తమ వారికి సర్దిచెప్పుకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఇంజనీర్లు గుర్తు చేసుకుంటున్నారు. మేధస్సు మాత్రమే కాదు వారి అంకుతిత దీక్ష కూడా అద్భుతమేనని మన్ననలు అందుకున్నారు.

కాకతీయ ఇంజనీరింగ్ సూపర్...

ఇసుక పునాదులు.. నీటిపై తేలియాడే ఇటుకలు.. భూకంపాలను తట్టుకునేలా శాండ్‌బాక్స్ సాంకేతికతతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. ఇప్పటి ఇంజనీర్లకు కూడా అంతు చిక్కని సాంకేతికత కాకతీయులది. ప్రపంచవ్యాప్త వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణం మహా అద్భుతంగా ఇంజనీర్లు పేర్కొంటారు. ఇసుక పునాదులతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. శాండ్‌బాక్స్ టెక్నాలజీతో రామప్పతో వెయ్యి స్తంభాల ఆలయాన్ని నిర్మించారు. ఎంత పెద్ద భూకంపాలు వచ్చిన తట్టుకునేలా ఈ శాండ్‌బాక్స్ టెక్నాలజీని అప్పటి ఇంజనీర్లు వినియోగించినట్టు చెబుతారు. అంతే కాకుండా నీళ్లలో తేలియాడే ఇటుకలను కూడా రామప్ప ఆలయ గోపురంపైన వాడారు. ఏనుగు పేడ, తవుడు, కరక్కాయ, చెట్ల జిగురుతో ఇటుకలను తయారు చేసి గోపురం నిర్మాణానికి వినియోగించారు. ఇప్పటికీ నీటిలో తేలియాడే ఇటుకలతో గోపురం చెక్కుచెదరకుండా ఉంది. ఇది అప్పటి కాకతీయ ఇంజనీర్ల సత్తా. అంతేకాకుండా వేలాది గొలుసుకట్టు చెరువుల నిర్మాణం కాకతీయ ఇంజనీర్ల మేదస్సుకు నిదర్శనంగా నిలుస్తాయి. ఓరుగల్లు గడ్డపై ఇంజనీర్ల ఆమోఘ ప్రతిభను కనబరిచారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

హరికోట్ల రవిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలి

రాంనగర్, సెప్టెంబరు 14: మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్, వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన హరికోట్ల రవి అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ జరిపి అతడిపై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన టీఎస్ఎఫ్, డీఎంఎస్‌పి నేతలు సుదీర్ఘకాలం వరంగల్‌లో పనిచేసిన రవి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, అతడిపై చర్య తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నేతలు డి.నరేష్, కె.సునిల్, వంశీకృష్ణ ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

31వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబా రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.31వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

జీవిత భాగస్వామికో ప్రశంస..

- హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్
- 'ఆమె' శ్రమను గుర్తించేది మాత్రం అతితక్కువ మందేనట
- కొంత సమయం కూడా మాట్లాడని వారెందరోనని అభిప్రాయాలు
- నేడు భార్యను ప్రశంసించే రోజు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భార్య.. భర్తలో సగభాగమే కాదు. ప్రతీ కష్టంలోనూ తోడుండే ఏకైక బంధం. మూడు ముళ్లు పడినప్పటి నుంచి జీవిత చరమాంకం వరకు తోడుగా వచ్చే భార్య భర్త కష్టసుఖాలను అర్థం చేసుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తుంది. అలాంటి భార్య శ్రమను గుర్తించే మగవారు మాత్రం అతితక్కువ మందే ఉంటున్నారట. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో అసలు భార్యతో కొంత సమయం కేటాయించి మనసువిప్పి మాట్లాడని వారు ఎందరో ఉన్నారట. అయితే కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుంటూ ఎంతో కష్టపడే భార్య.. తన భర్త నుంచి ఒక్క ప్రశంస వస్తే చాలు అనుకుంటుందట. ఆ ఒక్క ప్రశంసతో తన కష్టాన్నే మరిచిపోతుందట. అందుకే ఏటా సెప్టెంబరు నెలలో వచ్చే మూడో ఆదివారాన్ని భార్యను ప్రశంసించే రోజులుగా జరుపుకొంటున్నారు. వాస్తవానికి ఈ రోజును ఎందుకు, ఎప్పటి నుంచి జరుపుకుంటున్నారో తెలియదు కానీ.. 2006 సెప్టెంబరు మూడో ఆదివారం నుంచి అధికారికంగా అంతర్జాతీయంగా భార్యను ప్రశంసించే రోజు నిర్వహిస్తున్నారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో ఇది అంతగా వెలుగులోకి రాలేదు కానీ కొన్ని దేశాల్లో మాత్రం భర్తలు తమ భార్యలతో ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది.

లైఫ్‌లో బెటర్ హాఫ్..

మన సంస్కృతి సంప్రదాయాల్లో భార్యకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆమె లేని జీవితాన్ని ఊహించుకోలేం. ఊహించుకోండి.. నిత్యం ఇంటి పనులే కాదు భర్త, పిల్లల ఆలనాపాలన, కుటుంబ పెద్దల బాగోగులు చూసుకునే క్రమంలో తెల్ల వారింది మొదలు నిద్రపోయే వరకు ఎంతో శ్రమిస్తుంటారు. ప్రస్తుతమైతే మగవారితో సమానంగా ఉద్యోగ, వ్యాపార తదితర బాధ్యతల్లోనూ రాణిస్తున్నారు. ఈ క్రమంలో వారు పడుతున్న శ్రమకు ప్రతిఫలంగా భర్త నుంచి ప్రశంస అందితే చాలని చాలామంది మహిళలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ విషయంలో భర్త నుంచి ఏమాత్రం ఓదార్పు లేదా ప్రశంస దక్కటం లేదని చాలా మంది ఆవేదన చెందు తుండటం గమనార్హం. పెళ్లి ఎప్పుడైందన్నది కాకుండా భార్యను ఒక్కసారి మెచ్చుకోగలిగితే.. అంత కన్నా హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్ ఇంకేం ఉండదని, అదే జీవితంలో బెటర్ హాఫ్ అని అభిప్రా యపడుతున్నారు.

- భాగస్వామి తాను పడిన శ్రమను మరిచిపోయేలా ప్రశంసించడమే కాదు వారు ఎంతో ఇష్టపడే బంగారు ఆభరణాలు, చీరలు, ఇతర సౌందర్య సాధనాలను బహుమతిగా ఇవొచ్చు. లేదంటే వంట నుంచి ఈ ఒక్క రోజున విశ్రాంతి ఇచ్చి భర్త ఆమెకు ఇష్టమైన వంటలు చేసి పెట్టొచ్చు. లేదంటే ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లి, తనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ సర్‌ప్రైజ్ చేయవచ్చు. పువ్వులు, చాక్లెట్లు ఇలా వారికి నచ్చిన వాటితో ట్రీట్ ఇవ్వాలి. ఆమెను పొగుడుతూ ఓ కవితను రాయవచ్చు.

అంతేకాదు సోషల్‌మీడియాను వేదికగా చేసుకుని ఆమెను ప్రశంసిచొచ్చు. వైవాహిక జీవితం ప్రారంభ రోజుల నుంచి ఇప్పటి వరకు ఉన్న జ్ఞాపకాలు, ఫొటోలను ఒక పుస్తక రూపంలో తయారు చేసి బహుమతిగా ఇవ్వొచ్చు. రోజంతా వారితోనే పూర్తి సమయం కేటాయించగలిగితే.. ఆ ఒక్క రోజును వారు ఏడాదంతా గుర్తుంచుకుని కుటుంబబాధ్యతల్లో తాము ఎదుర్కొనే కష్టాలను సైతం మరిచిపోగలరని నిపుణులు చెబుతున్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY

వరంగల్ సిటీ

● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ

6

ఆదివారం 15 సెప్టెంబరు 2024

టీఎఫ్‌సీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సామల గణేష్

వరంగల్ సిటీ, సెప్టెంబరు 14: నగరంలోని 19వ డివిజన్ సొసైటీకాలనీకి చెందిన సినీ నటుడు, నిర్మాత సామల గణేష్ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు ప్రతాని రామక్రిష్ణ గౌడ్ ప్రకటించారు. గణేష్ మాట్లాడుతూ 30 ఏళ్లగా పలు సినిమాలను నిర్మించడంతోపాటు పలు సినిమాలలో నటించి అందరి మనసు చూరగొన్నానని అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం సినిమా అలాగే, టీవీ రంగంలోని కళాకారులను అందరినీ కలుపుకు పోయి మరింత విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు.



రామక్రిష్ణగౌడ్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న గణేష్

విభిన్న సంస్కృతులకు వారధి హిందీ భాష



మాట్లాడుతున్న జీజేసీ ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్

శంభునిపేట, సెప్టెంబరు 14: విభిన్న సంస్కృతులు, భాషలు కలిగిన భారత దేశంలో హిందీ భాష వారధిగా ఉంటుందని అరవింద పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పంచకం నర్సయ్య అన్నారు. శనివారం రంగశాయిపేటలోని పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకురాలు రూపారాణి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అధ్యక్షతన జరుపుకున్నారు.

అమరులను స్మరిస్తూ ర్యాలీ



వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

గిర్మాజిపేట, సెప్టెంబరు 14: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్ జిల్లా కేంద్రంలో ఎంసీపీఐ(యూ) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల ర్యాలీని నిర్వహించింది. నగరశాఖ కార్యదర్శి సుంచు జగదీశ్వర్ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ మీదుగా అండర్‌బ్రిడ్జి సమీపంలో ఎంసీపీఐ(యు) పార్టీ కార్యాలయం ఓంకార్ భవన్‌కు వరకు సాగింది. జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లాసహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నాయకులు రాగసుధ, ఐతం నగేష్, మల్లికార్జున్, మాలి ప్రభాకర్, పరిమళ గోవర్ధన్ రాజు, నరసయ్య, రవి, నరహరి, నిర్మల, జటబోయిన నరసయ్య, బిందు, లావణ్య, ప్రమీల పాల్గొన్నారు.

ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు : సీపీఎం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగయ్య

కరీమాబాద్, సెప్టెంబరు 14: మార్క్సిస్ట్ మహా మేధావి సీతారాం ఏచూరిని కోల్పోవడం పార్టీకి తీరనిలోటు అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే నిజమైన నివాళి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. శనివారం ఉర్సుగుట్ట ప్రాంతంలోని పార్టీ జిల్లా కార్యాలయం రామసురేందర్ భవన్‌లో జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య అధ్యక్షతన ఏచూరి సంతాప సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి నాగయ్య మాట్లాడుతూ ఏచూరి ఎమర్జెన్సీ రోజుల్లో జైలుజీవితం కూడా గడిపారని, కమ్యూనిస్టు నాయకుడిగా శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్పొరేట్ వ్యవస్థపై నిరంతరం పోరాడినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు బాబు, నలిగంటి రత్నమాల, భూక్య సమ్మయ్య, ఈసంపల్లి బాబు, కోరబోయిన కుమార్‌స్వామి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 14: నగరంలో గణేశ్ నిమజ్జన ఉత్సవాలు, మీలాద్ ఉన్ నబీ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని నగరవాసులను వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ కోరారు. శనివారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం జరిగింది. ముస్లిం మతపెద్దలు, వరంగల్ సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు. ఏసీపీ మాట్లాడుతూ.. 16న వినాయక నిమజ్జనం, 19న మీలాద్ ఉన్ నబీ ఉత్సవాలు నిర్వహించేందుకు ముస్లిం మతపెద్దలు విన్నవించారు. దీంతో 19న మీలాద్ ఉన్ నబీ ఉత్సవాలు నిర్వహించేందుకు అంగీకారం తెలిపినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో మట్టెవాడ, మిల్స్‌కాలనీ సీఐలు తుమ్మ గోపి, మల్లయ్య, ఇంతేజార్‌గంజ్ ఎస్సై వెంకన్న, కార్పొరేటర్ పుర్ఖాన్, కాంగ్రెస్ నాయకులు అయూబ్, ఎంఏ సుబాన్, మాజీ కార్పొరేటర్ యాకుబ్ పాషా, ఖుర్షీద్, సాజిత్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ఖిలావరంగల్, సెప్టెంబరు 14: ఖిలావరంగల్‌కోటలో సీఐ మల్లయ్య ఆధ్వర్యంలో శనివారం గంజాయిని పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం. ఖిలావరంగల్ చమన్‌కు చెందిన ఆటో డ్రైవర్ పసునూటి నాగరాజు ఇంట్లో పక్కా సమాచారం మేరకు మిల్స్‌కాలనీ ఎస్‌ఐ రవిందర్, పోలీసులు తనిఖీ చేశారు. వంట గదిలో హ్యాండ్ బ్యాగ్‌లో 2కిలోల 100గ్రాముల గంజాయిని గుర్తించారు. వాటి విలువ రూ.50వేలు ఉంటుందని, నాగరాజుకు గంజాయి తాగే అలవాటు ఉన్నందున ఫిబ్రవరిలో సీలేరు వెళ్లి అక్కడ నవీన్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసిన తెచ్చుకున్నాడు. ఈరోజు వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి అమ్ముదామని ఇంట్లోదాచి పెట్టిన గంజాయిని పక్కా సమాచారం మేరకు పట్టుకున్నారు. అతనిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఆస్పత్రిలో అవస్థలు

- ఖాళీగా ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టు
- వైద్య పరీక్షల కోసం రోగుల ఇబ్బందులు
- సీకేఎం ప్రసూతి ఆస్పత్రిని పట్టించుకోని పాలకులు





నగరంలోని సీకేఎం ఆస్పత్రి, ఆస్పత్రిలోని ల్యాబ్ (ఫైల్)

గిర్మాజీపేట, సెప్టెంబరు 14: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులలో ఒక పోస్టు సంవత్సరాలుగా ఖాళీగా ఉండగా, మరో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఆర్.కల్పన రెండు నెలల క్రితం గీసుగొండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి బదిలీ అవడంతో ల్యాబ్ టెక్నీషియన్‌లు లేక ఆస్పత్రిలో ల్యాబ్ సేవలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి నిత్యం 500 మంది అవుట్ పేషంట్లు, 200 మంది ఇన్‌పేషంట్లు ఆస్పత్రిలో స్త్రీ వైద్య చికిత్స ప్రసూతి సేవలు పొందుతుంటారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వివిధ పరీక్షలు ఆస్పత్రిలోని ల్యాబ్ టెక్నీషియన్ చేసేవారు. అయితే ఆస్పత్రిలోని ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 పోస్టులు రెండు ఖాళీగా ఉండటంతో ల్యాబ్‌సేవలకు రెండు నెలలుగా తీవ్ర అంతరాయం కలుగుతోంది. పర్మినెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌లు లేకపోవడంతో ల్యాబ్‌లో అవుట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్, విద్యార్థి ల్యాబ్ టెక్నీషియన్‌ల పనితీరుపై పర్యవేక్షణ లోపించడంతో సీకేఎం ఆస్పత్రిలో ల్యాబ్ సేవలు అస్తవ్యస్తంగా మారింది. రోగులకు ల్యాబ్ పరీక్షలు చేసే పరికరాలు, ట్యూబ్‌లు లేకపోవడం, వాటికిఇండెంట్ పెట్టేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇన్‌చార్జి ఆర్ఎంఓలు దృష్టిపెట్టక పోవడంతో రోగులు రక్తం, థైరాయిడ్ తదితర పరీక్షలకు ప్రయివేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తు వ్యయప్రయాసాలకు గురవుతున్నారు. దీంతో సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ల్యాబ్ అస్తవ్యస్తంగా మారి రోగులకు ఇబ్బందికరంగా పరిణమించింది.

ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2017 ల్యాబ్ టెక్నీషియన్ నోటిఫికేషన్ ద్వారా 2018లో నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను ఇటీవల ప్రకటించింది. ఇందులో భాగంగా రేనుకుంట్ల శ్రీనాథ్‌ను సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2గా నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శ్రీనాథ్ 7న ఆస్పత్రిలో విధుల్లో చేరారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన శ్రీనాథ్ 2003 నుంచి దేవరుప్పల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సీకేఎం ఆస్పత్రి గ్రేడ్-2గా ఎంపికయ్యారు. ల్యాబ్ టెక్నీషియన్ కల్పన బదిలీతో గత రెండు నెలలుగా స్తంభించి ల్యాబ్‌సేవలు ల్యాబ్‌టెక్నీషియన్ నియామకంతో గాడిన పడుతాయని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

పద్మశాలీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 14: నగరంలోని పద్మశాలీ పరస్పర సహాయక సహకార పరపతి సంఘం శివనగర్‌కు చెందిన వారు 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన సంఘం సభ్యుల పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి 30 వరకు దరఖాస్తు ఫారాలు అందజేసి తిరిగి తీసుకోబడునని సంఘం కార్యాలయం నందు రూ.5 చెల్లించి దరఖాస్తు ఫారం తీసుకోవాలని కోరారు.

శ్రీధర్‌కు బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు



అవార్డు తీసుకుంటున్న కోడెం శ్రీధర్

కరీమాబాద్, సెప్టెంబరు 14: కరీమాబాద్ ప్రాంతంలోని న్యూ కొటిల్యాస్ ఎస్‌ఏ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోడెం శ్రీధర్‌కు బెస్ట్ ప్రిన్సి పాల్ అవార్డు లభించింది. ఆల్ ఇండియా ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ న్యూఢిల్లీ, డిజిటల్ శాటిలైట్ స్కూల్స్ హైదరాబాద్ వారిచే ఈ అవార్డును సబితశ్రీధర్ అందుకున్నారు. శనివారం హైదరాబాద్ జీడిమెట్లలోని టీఆర్ఎస్ఎంఏ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాజసింహా గౌడ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 33 జిల్లాల తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీఆర్ఎస్ఎంఏ) ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తిని చితకబాదిన ఇద్దరిపై కేసు

కరీమాబాద్, సెప్టెంబరు 14: నగరంలోని బీఆర్‌నగర్‌కు చెందిన సంతోష్ అనే వ్యక్తిని చితకబాదిన ఇద్దరు వ్యక్తులపై మిల్స్‌కాలనీ పోలీసులు శనివారం కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఆలస్యంగా ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన సంతోష్ తన పొలం పనులను ముగించుకొని బీఆర్ మీదుగా ఎస్ఆర్ఆర్ తోటకు వెళ్తున్నాడు. బీఆర్‌నగర్ వద్ద ఒక జంక్షన్‌లో ఆటోలో నుంచి రౌడీషీటర్ మల్లిఖార్జున్, సమోసా సంపత్‌లు ఉమ్మడంతో సంతోష్‌పై పడింది. దాంతో ఎందుకు మీద ఉమ్మారంటూ ప్రశ్నించాడు. మాటా మాటా పెరిగి మల్లికార్జున్, సంపత్‌లు సంతోషను విచక్షణరహితంగా పిడి గుద్దులు గుద్దుతూ, పక్కకే ఉన్న కర్రను తీసుకొని కర్ర విరిగేలా కొట్టారు. గురువారం రాత్రి సుమారు 9గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

ట్రస్మా ఆధ్వర్యంలో పోటీలు

కాశిబుగ్గ, సెప్టెంబరు 14: వడుప్సా(ట్రస్మా) ఆధ్వర్యంలో శనివారం ఓసిటీలోని స్టేడియంలో పోటీలు నిర్వహించారు. ట్రస్మా వరంగల్ డివిజన్ కరస్పాండెంట్లకు ఈ పోటీలు జరిగాయి. క్రికెట్, చెస్, క్యారం పోటీలను ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెమురుగొమ్ముల రమేష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, స్పోర్ట్స్ కన్వీనర్ ఖలీల్, భూపాల్ రావు, చంద్రారెడ్డి, రవి, కనకయ్య, విలియం, సుధీర్, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, సూర్యనారాయణ, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్తమ బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డు అందుకున్న మీర్జా

మట్టెవాడ, సెప్టెంబరు 14: క్రిస్టియన్ కాలనీలోని యూనిక్ హైస్కూల్ కరస్పాండెంట్ మీర్జా సమీ ఉల్లా బేగ్‌కు బెస్ట్ ఎడ్యుకేటర్-24 అవార్డును శనివారం అందుకున్నారు. ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నేతృత్వంలో హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ మీర్జా సమీ ఉల్లా బేగ్ టీఆర్ఎస్ఎంఏ చీఫ్ అడ్వయిజర్ వై.శేఖర్‌రావు, డైరెక్టర్ శిజూ అగస్టీన్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



ఉత్తమ అవార్డు తీసుకుంటున్న సమీర్ ఉల్లా బేగ్

బెస్తం చెరువును పరిశీలించిన అధికారులు



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఖిలావరంగల్, సెప్టెంబరు 14: వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఖిలావరంగల్ మండల రెవెన్యూ అధికారులు, మామునూర్ సీఐ రవికుమార్ తదితరులు పరిశీలించారు. 16న నిమజ్జనం జరిగే బెస్తం చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి, సాయినగర్ కాలనీ అధ్యక్షుడు కర్నె రవిందర్, వినాయకకాలనీ అధ్యక్షుడు సుభాష్‌రావు, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఖిలావరంగల్ మాలఅగర్తల, పెద్ద చెరువుల వద్ద వినాయ కని మజ్జనం సందర్భంగా వినాయకులను చెరువులో వేసేందుకు తెప్పను తయారు చేస్తున్నారు. రంగశాయిపేటబెస్తం చెరువుకు వెళ్ళే రోడ్లతో పాటు, ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువుకు వచ్చే రోడ్ల కిరువైపులా పెరిగిన ముళ్ళపొదలను తొలగించి, కంకర, మొరం చేస్తున్నారు.

వైభవంగా గణపతి నవరాత్రులు

శంభునిపేట, సెప్టెంబరు 14 : గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శనివారం రంగశాయిపేటలోని రామలింగేశ్వర ఆలయంలో, కురుమవాడలో వినాయక యూత్ ఆధ్వర్యంలో యాదవవాడలో, భగత్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. విశ్వబ్రాహ్మణ వీధిలో ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మంగారి హరికథ ముగిసింది. రుద్రమ నగర్‌లో అయోధ్య రామ మందిరం సెట్‌తో ఆకట్టుకుంటోంది. కార్యక్రమాల్లో కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి, ఈదురు అరుణవిక్టర్, కర్నె రవీందర్, ముత్తినేని రామ్మూర్తి, దామెరకొండ కర్ణాకర్, కత్తెరపెళ్ళి వేణు పాల్గొన్నారు. మామునూరు క్యాంపు లక్ష్మీపురంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తోపుచర్ల విజయ దేవేందర్, కార్పొరేటర్ జలగం అనిత, టి.విజయ, నిర్మల, అరుణ, విమల పాల్గొ న్నారు.

● గిర్మాజిపేట: నగరంలోని అండర్‌బ్రిడ్జి సమీపంలోని కొండా పటేల్(ఎల్‌బీఆర్) కాలనీలో శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, కొండా పటేల్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దౌడు నాగరాజు, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, సోము, నాగరాజ్, ఎస్.కే.జావిద్, మహేందర్, నాగేందర్ పాల్గొన్నారు.



సాయిగణేష్ నగర్‌లో శాకంబరీ అలంకరణలో..

● వరంగల్‌సిటీ: ఏనుమాముల ఎన్‌టీఆర్ నగర్‌లో స్నేహ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బావండ్లపెల్లి కిరణ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏనుమాముల సీఐ రాఘవేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఏనుమాముల ఎస్ఐ రాజు, నాయకులు అడుప మహేష్ కేతిరి రాజశేఖర్, కొత్తపల్లి యాదగిరి, బుజగుండ్ల సంతోష్, పిట్ట నగేష్, నాయిని కృష్ణ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: శాలినీనగర్‌లో గౌరీ తనయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 150 రకాల నైవేద్యాలతో గణపతికి నివేదనం చేశారు. అర్చకుడు శివశ్రీ భోగేశ్వరశాస్త్రి మహిళలతో కుంకుమార్చన చేయించారు. లేబర్‌కాలనీలో యువ యూనిట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జన్ను రవి, కాంగ్రెస్ నాయకులు పందిరి రమేష్, బల్ల సదానందం, బలభద్ర సొంబయ్య, మెరుగు సొంబమూర్తి, చిప్ప జీవన్, యూత్, మహిళా నాయకులు నాగరాజు, రమాదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు. శివనగర్‌లోని గణపతికాలనీలో లంబోదర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● వరంగల్ కల్చరల్: కందుల సత్యనారాయణ ఫౌండేషన్ శనివారం నగదు బహుమతులను అందజేసింది. కాకతీయ థియేటర్ పక్కన ఏర్పాటుచేసిన భద్రకాళి యూత్ అసోసియేషన్ కమిటీ వారికి రూ.5వేలు (ప్రథమ), కాకతీయ యూత్ అసోసియేషన్ రూ.3వేలు(ద్వితీయ), కాపువాడలో పార్వతీపుత్ర గజానన మండలి రూ.2వేలు(తృతీయ) అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్, టీపీసీసీ కో ఆర్డినేటర్ బండి లక్ష్మణ్, ప్రముఖ న్యాయవాది కందుల శ్రీలత చేతుల మీదుగా అందజేశారు.



శాలినీనగర్‌లో 150 రకాలతో నైవేద్యం



ఎన్టీఆర్‌నగర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న సీఐ రాఘవేందర్



కొండా పటేల్‌కాలనీలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ప్రకాష్

జవాబుదారీగా ప్రత్యేకాధికారులు వ్యవహరించాలి

- కలెక్టర్ సత్యశారద

కాశిబుగ్గ, సెప్టెంబరు 14: విధులు కేటాయించబడిన ప్రత్యేక అధికారులు జవాబుదారీతంగా వ్యవహరించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేకాధికారుల పాత్ర కీలకమన్నారు. పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగుచర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా పారిశుధ్యం, నర్సరీ, తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్‌దీపాలు, అంతర్గత రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీ ఎన్నికలు జరిగేంత వరకు ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాంరెడ్డి, డిప్యూటీ సీఈవో వసుమతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

చెరువుల వద్ద భద్రత ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్

కాశిబుగ్గ, సెప్టెంబరు 14: వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద భద్రత ఏర్పాట్లు చేయాలని చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ పోలీసు అధికారులను కోరారు. సొసైటీ సమావేశం శనివారం కాశిబుగ్గ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చెరువుల వద్ద ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తగినన్ని క్రేన్‌లు అందుబాటులో ఉంచి వినాయక విగ్రహాలుండే వాహనాలు బారులు తీర కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. సొసైటీ ప్రతినిధులు సిలువేరు నగేష్, వెంకటేశ్వర్లు, థామస్, మల్లికార్జున్, నిరంజన్, హరినారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మునిసిపాలిటీలలో ప్రవేశపెట్టిన ఎల్ఆర్ ఎస్ దరఖాస్తుదారుల అనుమానాల నివృత్తి, దరఖాస్తుల స్వీకరణ నత్తనడకన సాగుతోంది. మునిసిపాలిటీల వారిగా ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌లలో దరఖాస్తుదారులు కనిపించకపోవడంతో అధికారులు పనిలేక కూర్చుంటున్నారు. రోజుకు 20 నుంచి 30 మంది దరఖాస్తుదారుల కోసం ఇద్దరు అధికారులు నిరంతరంగా పని చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌పై బల్దియా అధికారులు ప్రజలకు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలున్నాయి. కనీసం ప్రత్యేకంగా కాలనీలలో జీపులకు మైకులను అమర్చి ప్రజలకు అవగాహన కల్పించలేదనే విమర్శలు వెలువడుతున్నాయి.

ఎల్ఆర్ఎస్‌లపై దృష్టి

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్)పై దృష్టి సారిం చింది. ప్లాట్లు, వ్యవసాయ భూములు క్రమబద్ధీకరించేందుకు గతంలో ప్రజలు దరఖాస్తులు చేసుకోగా, ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం ముందుకొచ్చింది. మూడు మాసాలలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికీ బల్దియాలో ఒక్క శాతం కూడా పూర్తికాకపోవడంతో సిబ్బంది నిస్సహాయస్థితిలో పనిచేస్తున్నారు.

375 దరఖాస్తుల పరిశీలన

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల పరిధిలో భూములు క్రమబద్ధీకరించుకునేందుకు 2020 ఆగస్టు 26వరకు 1,09,689 మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో పరిశీలనకు నోచుకోలేదు. దీంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల పరిశీలనకు గత ఆగస్టు నెల 24 నుంచి బల్దియాలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఎల్ఆర్ఎస్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న ఆర్జిదారులకు మెసేజ్, ఫోన్‌ద్వారా పిలిపించి వారి అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. అయితే ఈ 20 రోజుల్లో 375 మంది దరఖాస్తుదారులు వచ్చి భూముల సమస్యను పరిష్క రించే పనిలో పడ్డారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రశీదు లేదా ఫోన్ నెంబర్ ద్వారా హెల్ప్‌డెస్క్‌లో పని చేస్తున్న అధికారులు ప్రాంతాల వారిగా పనిచేస్తున్న అధికారులు పేర్లు, ఫోన్ నెంబర్లు ఇస్తున్నారు.

బల్దియా అవగాహన రాహిత్యం

ముఖ్యమంత్రి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను యుద్ధప్రా తిపదికన అధికారులు పరిష్కరించాలని సమీక్షా సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లలో ఆదేశించినా వరంగల్ బల్దియా అధికారులు నిద్రమత్తు నటిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బల్దియా కార్యాలయం, కలెక్టర్ కార్యాలయాల్లో రెండు చోట్ల రెండు ఫ్లెక్సీలు తప్ప.. ఎక్కడా ప్రజలకు అవగాహన కల్పించపోవడంతో దరఖాస్తుదారులు రాలేకపోతున్నారని చెప్పుకొస్తున్నారు. చాలామందికి దరఖాస్తుదారులకు ఇప్పటివరకు ఎల్ఆర్ఎస్ అంటే ఏమిటో కూడా తెలియని స్థితిలో ఉన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వం రూ.కోట్లు వసూలు చేసి కనీసం అవగాహన కల్పించకపోవడంతోపాటు ప్రచారం చేయకపోవడంతో ప్రజలు బల్దియా తీరుపై నిరాశ చెందుతున్నారు. గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తే లక్ష్యం చేరుకోవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మూడు శాఖల బృందాలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు మూడు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. బల్దియా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఉన్నతాధికారులను 12 టీములుగా చేశారు. 7 హనుమకొండ, 5 వరంగల్ ప్రాంతంలో పనిచేస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న భూమి పట్టా, ప్రభుత్వ భూమా? లేక చెరువు శిఖం, కెనాల్ కింద ఉందా? అని అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేసి దరఖాస్తును ప్రత్యేక యాప్ ద్వారా ఉన్నతాధికారులకు చేరవేస్తారు. కానీ ఎల్ఆర్ఎస్ యాప్ తరచుగా మొండికేయడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు.

నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న నీలిమ

సంగెం, సెప్టెంబరు 14: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలోని విశ్వం పాఠశాలలో నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి నీలిమ శనివారం అందుకున్నారు. ఈ అవార్డులను సర్వేపల్లి మనవడు సుబ్ర మణ్యశర్మ అందించినట్లు నీలిమ చెప్పారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల ప్రగతితో పాటు పలు మార్లు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించి పరిశీలన చేసిన అనంతరం ఎంపిక చేశారని తెలిపారు. జిల్లాలో ఇద్దరికే ఈ అవార్డు లభించిందన్నారు.



అవార్డు అందుకుంటున్న నీలిమ

ఉపాధి కూలీలకు వరం జన్‌మన్‌రేగా

వర్ధన్నపేట, సెప్టెంబరు 14 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలు ఒకప్పు డు తమ కూలీ డబ్బులు ఖాతాలో జమ అయ్యాయో? లేదో? తెలుసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడే వారు. ఎంపీడీవో కార్యాలయానికి, పోస్టాఫీసులకు పైసల కోసం పరుగులు తీసేవారు. కూలీలుపడు తున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం అరచేతిలో సమగ్ర సమాచారం తెలుసుకునేలా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. నేటి ఆధునిక కాలంలో ప్రతీ ఇంటిలో స్మార్ట్ సెల్‌ఫోన్ కలిగి ఉండడం సర్వసాధారణంగా మారింది. స్మార్ట్‌ఫోన్ కలిగిన ప్రతీ ఒక్కరు గూగుల్ ప్లేస్టోర్ నుంచి జన్‌మన్‌రేగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీ పని హాజరు, చెల్లింపు లు ఆప్షన్‌పై క్లిక్ చేస్తే బ్లాగ్ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ కార్డు సంఖ్యను నమోదు చేస్తే వివరాలు కనిపిస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేయగానే పనిచేసిన రోజులు, కూలీ మొత్తం, ఏ బ్యాంకు ఖాతాకు డబ్బు జమ అయినది కనిపిస్తుంది. ఒక వేళ నగదు జమకాకపోతే కారణాలు అక్కడ పొందుపరచబడి ఉంటాయి. మరోవైపు ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనుల సమాచారం, స్థానికంగా చోటు చేసుకునే అవకతవకలపై ఫిర్యాదు చేయడానికి అవకాశం కల్పించారు. వర్ధన్నపేట మండలంలో ని 18 గ్రామ పంచాయతీల్లో 8,493 జాబ్‌కార్డులు ఉండగా, వాటిలో 16,815 మంది పేర్లు నమోదు చేసుకోగా, 4971 కార్డులు హోల్డర్స్ 7,670 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు.



అవగాహన పెంచుతున్నాం: శ్రీపాధి నాగేష్, ఏపీవో, వర్ధన్నపేట



కేంద్ర ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన జన్‌మన్‌రేగా యాప్‌పై కూలీల్లో అవగాహన పెంచుతున్నాం. ప్రస్తుతం ప్రతీ కుటుంబంలో సెల్‌ఫోన్ సర్వసాధారణమైంది. ఈ యాప్ అందుబాటులోకి రావడం కూలీలకు వరం. ఇంట్లోనే ఉండి సమగ్ర సమాచారం తెలుసుకునే సదుపాయం యాప్ ద్వారా లభిస్తుంది. ఈ అవకాశాన్ని ప్రతీ కూలీ సద్వినియోగం చేసుకోవాలి.

హిందీపై పట్టు సాధించాలి

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 14 : గురిజాలలో జడ్‌పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం జాతీయ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అర్పిత మాట్లాడుతూ భారతదేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాష హిందీ అని అన్నారు. అనంతరం హిందీ భాషపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

● వర్ధన్నపేట రూరల్ : ఉప్పరపెల్లి ప్రభుత్వ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమారాణి మాట్లాడుతూ మాతృ భాష తెలుగుతో పాటు ప్రతీ ఒక్కరు హిందీ భాష నేర్చుకునేందుకు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, రూపారాణి, సదానందం, పీఈటీ వీరస్వామి పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల విద్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు హిందీ భాషపై మక్కువ పెంచుకొని, ప్రతీ విద్యార్థి హిందీ భాషను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, హిందీ ఉపాధ్యాయులు మడుగుల కుమార్, ముదరు పద్మ, బొనగాల రమేష్‌గౌడ్, జక్కుల జగదీశ్వర్, మేడి రమేష్‌గౌడ్, కృష్ణమోహన్, వల్లా వేణు, గణేష్, పొన్నం రమేష్ పాల్గొన్నారు.



చెన్నారావుపేటలోని సిద్ధార్థ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ గోపాల్‌రెడ్డి

పాపయ్యపేట, జల్లి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, హెచ్‌ఎం సరళ, కుమారస్వామి, కృష్ణమూర్తి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

● నల్లబెల్లి : విద్యార్థులు హిందీ భాషను నేర్చుకోవాలని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కొండా నటరాజ్ సూచించారు. పాఠశాలలో హిందీ దివస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ రవూఫ్, శ్రీనివాస్, మంజుల, ఇందిర, సుధారాణిపాల్గొన్నారు.

● రాయపర్తి: హిందీ భాషా భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని హెచ్‌ఎం కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా హిందీ దినోత్సవం నిర్వహించారు. డ్రాయింగ్, హిందీ పద్యాలు, వచనాలు, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమ తులు అందించారు.

● పర్వతగిరి : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం పాక రమేష్‌బాబు మాట్లాడుతూ హిందీ భాష మన దేశ సమైక్యతను పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు ఎల్.రజిత, ఎ.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ : మొగిలిచర్ల, ఎలుకుర్తి పాఠశాలల్లో నిర్వహించారు. హిందీభాష ఆవశ్యకతను విద్యార్థులకు ఉపాధ్యా యులు విద్యార్థులకు వివరించారు. చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయ్‌కుమార్, సతీష్‌చంద్ర, హిందీ ఉపాధ్యాయులు రవిందర్, కిశోర్, ఉపాధ్యాయులు కిరణ్మయి, శ్రీనివాస్, రమేష్, సాంబయ్య కిషన్, విజయలక్ష్మి, కరుణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



వర్ధన్నపేటలో బదిలీపై వెళ్లిన అధ్యాపకులకు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

వర్ధన్నపేట, సెప్టెంబరు 14 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శ్రీద సుమన్ అన్నారు. శనివారం వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఊళ్ల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పఠనాసక్తిని పెంచుకుని శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఉద్బోధించారు. కళాశాల నుంచి బదిలీ అయిన ప్రిన్సిపాల్ జితేందర్‌రెడ్డి, ఫిజిక్స్ అధ్యాపకురాలు జ్యోతిర్మయికి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందించి శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో అధ్యా పకులు రాజేంద్రప్రసాద్, సంధ్యా రాణి, శోభారాణి, డాక్టర్ వేణుమాధవి, సమీన, తిరుపతి, రాజ్‌కుమార్, స్వరూప, బోధనేతర సిబ్బంది, రజిత అనిల్‌కుమార్, వనమాల, ఉమారాణి, ఇద్దమ్మ, నవీన్‌కుమార్‌రాజు, శారద విద్యార్థులు పాల్గొన్నారు.

● గీసుగొండ: వంచనగిరి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ గుర్తూరుకు బదిలీ అయిన నాగేశ్వర్‌రావును, ఉపాధ్యాయులు శ్రీకాంత్, స్రవంతి, స్వప్నలను శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రజితసారంగం, సీనియర్ ఉపాధ్యాయురాలు మాధవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, సీఆర్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీని బలోపేతం చేయాలి

నర్సంపేట, సెప్టెంబరు 14 : తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ పాపారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. పట్టణంలో శనివారం రాత్రి పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేం ద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అభివృద్ధి సంక్షేమంలో ముందంజలో నిలిచిందన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలని వారు సూచించారు. కిందిస్థాయిలో ప్రజా ప్రతినిధులను గెలిపిస్తే పార్టీ బలం పెరుగుతుందన్నారు. పార్టీ సభ్యత్వం ద్వారా, స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి అజ్మీర సీతారాంనాయక్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కంభంపాటి పుల్లారావు, తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, గూడూరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంట రవికుమార్

గణేశ్ మండపాల వద్ద అన్నదానం

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 14 : పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శింగిరి కొండ మాధవశంకర్, రజిని ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. వాసవి మహిళా విభాగం,యువజన విభాగం, ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 108ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో శింగిరి కొండ అండాలమ్మ, రామ్ రాజ్, అరుణ,అశోక్, మానస, సుజాత, శివ కుమార్, ఫణి కుమార్ పాల్గొన్నారు. అలాగే పాకాల్ రోడ్‌లో శంకరభక్తుల శివ, బాలాజీ, చలపతిరావు, సమ్మారావు, నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

● ఖానాపురం: శనివారం బుధరావుపేట, ఖానాపురం, మనుబోతులగడ్డలోని గణపతుల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పోచమ్మ గుడికి వెళ్లే దారివద్ద పోచమ్మ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి వద్ద తోటకూరి కిషన్ సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై రఘుపతి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, నర్సంపేట ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ప్రారంభించారు.

చింతలపల్లిలో కుంకుమార్చన

సంగెం: చింతలపల్లిలో జై బోలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుడి మండపంలో కుంకుమార్చన ఘనంగా జరిగింది. భవానీ శంకరాలయ అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. 108మంది మహిళలతో కుంకుమార్చన చేశారు.



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

గీసుగొండ, సెప్టెంబరు 14 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ టీజీ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పార్వతి సత్యనారాయణ అన్నారు. సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా ధర్మారం, గీసుగొండ జెడ్పీ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సంగీత, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నవీన్, మురళి, సర్వేశ్వర్, ముఖ్య సలహాదారు సారయ్య పాల్గొన్నారు.

కోదండ రామాలయం పొదుపు సంఘం కమిటీ

ఖానాపురం, సెప్టెంబరు 14 : మండలంలోని రంగాపురం కోదండ రామాలయం పొదుపు సంఘం కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి బాబురావు, ఉపాధ్యక్షుడిగా దేగల సదయ్య, కార్యదర్శిగా మీరాల సోమయ్య, సహాయ కార్యదర్శిగా పొద్దుటూరి వాసుదేవ్, కోశాధికారిగా ఎర్రబెల్లి బలరాంరావు, సలహాదారులుగా మాచర్ల కొమ్మాలు, కత్తి భిక్షపతి, పులి పెద్దవీరయ్య, జక్కా రంజిత్, తాళ్ల కొమ్మాలు, కూరెల్లి శరబయ్య, కోమాండ్ల నారాయణరావు, వెంకన్న, యాకయ్య, సత్యనారాయణ, వడ్డే రాంరెడ్డిలను ఎన్నుకున్నారు.

మునిసిపాలిటీలో రచ్చరచ్చ

వర్ధన్నపేట, సెప్టెంబరు 14 : చేయని పనులకు బిల్లులు ఇచ్చారు.. పనిచేసి రెండే ళ్లవుతున్నా బిల్లులు ఎందుకు ఇవ్వడంలేదని శుక్రవారం వర్ధన్నపేట మునిసిపాలిటీ కార్యాలయంలో కౌన్సిలర్లు రచ్చ చేయగా మరికొంతమంది కౌన్సిలర్లు బిల్లులు ఎత్తిన వారికే మద్దతునిచ్చారని రచ్చరచ్చచేసిన సంఘటన ఆలస్యంగావెలుగులోకి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయంలో గణేష్ నిమజ్జనోత్సవం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ విషయంపై చర్చిస్తుండగానే బిల్లుల విషయంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య గొడవజరిగినట్లు సమాచారం. ఇద్దరు సభ్యులు ఏకంగా పరస్పరం దూషించుకునే వరకు వెళ్లింది. ఇదే సమయంలో మునిసిపాలిటీలో కంప్యూటర్‌ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఉద్యోగికి, ఓ బీఆర్ఎస్ కౌన్సిలర్‌కు మధ్య బిల్లుల విషయంలో గొడవ చెలరేగింది. వర్ధన్నపేట మునిసిపాలిటీ భ్రష్టు పట్టడానికి నీవే కారణమంటూ కౌన్సిలర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.

కౌన్సిలర్ల ఆగ్రహానికి కారణం

వర్ధన్నపేట మునిసిపాలిటీలో చేయని పనులకు లక్షలాది రూపాయలు బిల్లులు చేయించుకున్నారు. వాటిలో కొద్దిభాగం నిధులు విడుదల చేయించుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న కౌన్సిలర్లు చేయని పనులకు బిల్లులు ఎలా ఇస్తారని, రెం డేళ్ల క్రితం తాము చేసినపనులకు బిల్లులు ఎందుకు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు చేయని పనులకు కొంతభాగం ఎలాఇచ్చారు? మిగతా నిధులు ఇస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కౌన్సిలర్లు చేసిన పనుల కోసం ఒక్కొక్క కౌన్సిలర్‌కు రూ.2లక్షల చొప్పున ఇస్తామని ఒప్పుకుని మాట్లాడుకుని బిల్లులు చెల్లిం చేందుకు ప్రక్రియ చురకుగా సాగుతుండగా వర్ధన్నపేట మునిసిపాలిటీలో కోట్లాది రూపాయల దుర్వినియోగం జరిగిందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు అందిందన్న ప్రచారమవుతున్న క్రమంలో స్థానికంగా పనిచేసే ఇంజనీరింగ్ అధికారి బదిలీ కాగా ఆ అధికారిని బిల్లులు చెల్లించమని వత్తిడిచేయగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ పూర్తయిన తరువాత బిల్లులు చేస్తామని చెప్పారు. అయినా మళ్లీ కొంత భాగం మునిసిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి మరికొన్ని నిధులు విడుదల చేసుకున్నాడు. ఈ వివాదంపై ఆనాటి అధికార పార్టీ పాలకవర్గం పార్టీలు మారి నేడు అధికార కాంగ్రెస్ పార్టీలో కీలకంగా మారడంతోపాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు అత్యంత సన్నిహితుడుగా ఉండడంతో విచారణ అంతా తూతూ మంత్రంగా సాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్ధన్నపేట మునిసిపాలిటీలో కౌన్సిలర్లు ఏ పార్టీలో ఉన్నా, ఏ పార్టీకి మద్దతునిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధాన పార్టీల అధిష్టాన వర్గాలు సైతం మునిసిపాలిటీలో జరుగుతున్న అవకతవకలపై నోరుమెదపక పోవడం గమనార్హం.



వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం



ఎమ్మెల్యే మాధవరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలి

నల్లబెల్లి, సెప్టెంబరు 14 : నల్లబెల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఏబీవీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏబీవీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ సంఘాల నాయకులు బొట్ల నరేష్, జన్ను రమేష్ మాట్లాడారు. కస్తూర్బా విద్యాలయంలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సానుకూలంగా స్పందించారు. అతిత్వరలో వాటర్ ప్లాంటు ఏర్పాటుతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 14 : హన్మకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈ నెల 10న జరిగిన అండర్ 12, 14 సంవత్సరాల బాలికల విభాగంలో అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న నర్సంపేటలోని మహాత్మ జ్యోతిరావుపూలే పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంగ శనివారం తెలిపారు. పరుగు పందెంలో వర్షిత, సహస్ర, నయానిక, అక్షర గోల్డ్‌మెడల్, షాట్ పుట్‌లో రక్షిత, లేఖ సిల్వర్ మెడల్ సాధించినట్లు చెప్పారు. ఈ నెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే ఇటీవల వరంగల్‌లో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీలలో పట్టణం లోని విజ్‌డమ్ హై స్కూల్ విద్యార్థులు జయంత్, సల్మాన్, రాణి, గౌతమి పాల్గొని ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జావెద్ శనివారం తెలిపారు. వీరు ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్మల్ జిల్లాలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల డైరెక్టర్ జహంగీర్, ఉపాధ్యాయులు నాజియా ఇక్బాల్, ఫహీమ్ సుల్తానా, ప్రకాశ్, ప్రశాంత్ తదితరులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు జ్యోతిరావుపూలే పాఠశాల విద్యార్థులు

జవాబుదారీగా ప్రత్యేకాధికారులు వ్యవహరించాలి : కలెక్టర్

కాశిబుగ్గ, సెప్టెంబరు 14 : విధులు కేటాయించబడిన ప్రత్యేక అధికారులు జవాబుదారీతంగా వ్యవహరించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేకాధికారుల పాత్ర కీలకమన్నారు. పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగుచర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా పారిశుధ్యం, నర్సరీ, తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్ దీపాలు, అంతర్గత రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీ ఎన్నికలు జరిగేంత వరకు ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాంరెడ్డి, డిప్యూటీ సీఈవో వసుమతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

పప్పుధాన్యాల పంటల సాగుపై తగ్గిన రైతుల ఆసక్తి

ఏటేటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం

సాగుతగ్గడం వల్లే పెరుగుతున్న పప్పుల ధరలు

నర్సంపేట, సెప్టెంబరు 14 : జిల్లాలోని అన్ని మండలాల్లో ఏటేటా పప్పు ధాన్యాల పంటల సాగు తగ్గిపోతుంది. పెసర, కంది, సోయాబీన్, బొబ్బెర, శనగ తదితర పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపడంలేదు. నష్టాల పాలు చేస్తున్న పత్తిసాగును తగ్గించి పప్పుదాన్యాల పంటలను సాగు చేసుకోవాలని ప్రభుత్వం, వ్యవసాయశాఖాధికారులు కొన్నేళ్ళ క్రితం ప్రచారాలు చేపట్టినా పప్పు ధాన్యాల సాగు పెరగలేదు. దిగుబడులు పెరిగినప్పటికీ మార్కెట్‌లో ఆశించిన మేరకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తెల్లబంగారంగా గుర్తింపు పొందిన పత్తి, ఎ ర్ర బంగారంగా పేరొందిన మిర్చిసాగు పట్ల రైతులు ఆసక్తిని చూపడంతో పప్పు ధాన్యాల పంటల సాగుగణనీయంగా తగ్గిపోయింది. కొన్నేళ్ళ క్రితం కంది. పెసర, సోయాబీన్, శనగ, వంటి పప్పుధాన్యాల సాగు అధికంగా ఉండేది. ఏ గ్రామంలో చూసినా కంది, పెసర తదితర పంటలు కనిపించేవి. పప్పు ధాన్యాలను సాగు చేస్తే అతివృష్టి, అనావృష్టికి తోడు మంచి ధర లభించక పోవడం వల్లే పప్పుదాన్యాల పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. ఇప్పటికే మినుములు, బొబ్బెర్లు, శనగ పంట సాగు కనిపించడం లేదు. దీంతో ఈ రకం పంటలు ఏ గ్రామంలో సాగయ్యాయో వెనుకులాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



మాధన్నపేట శివారులో సాగవుతున్న పెసర పంట, మాధన్నపేట-నల్లబెల్లి మార్గ మధ్యంలో సాగవుతున్న కంది పంట

వెయ్యి ఎకరాల్లో పప్పు ధాన్యాల సాగు

జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, దుగ్గొండి, చెన్నారావు పేట, నెక్కొండ, గీసుగొండ, పర్వతగిరి, సంగెం, వర్ధన్నపేట, రాయపర్తి, వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లో కేవలం కంది, పెసర, సోయాబీన్ పంటలు 1,100 ఎకరాల్లో సాగవుతున్నాయి. పెసర్లు 697 ఎకరాల్లో కందులు 271 ఎకరాల్లో సోయాబీన్ 133 ఎకరాల్లో సాగయ్యాయి. మూడేళ్ల క్రితం 60నుంచి 70వేల హెక్టార్లలో సాగైన కంది పంట సాగు భారీగా తగ్గిపోయి ఈ ఏడాది కేవలం 271 ఎకరాలకే పరిమితమైపోయింది. పెసరు సుమారు 70వేల ఎకరాల వరకు సాగయ్యేది. ప్రస్తుతం పెసర పంట కేవటం 697 ఎకరాలకు తగ్గిపోయింది.

ఈ పంటల సాగుపై రైతులు అనాసక్తి చూపడంతో ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. ఒకప్పుడు ఏ గ్రామానికి వెళ్లినా కనుచూపు మేరకు పప్పు దినుసుల పంటలే కనిపించేవి. ప్రస్తుతం పప్పు దినుసుల పంటలు ఎక్కడ సాగు చేశారో వెతుక్కోవల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మార్కెట్‌లో వివిధ రకాల పప్పుల ధరలు ఆకాశన్నంటినప్పటికీ ఈ పంటల సాగుపై రైతులు మొగ్గు చూపడం లేదు. ప్రభుత్వం. వ్యవసాయ శాఖ అధికారులు కూడా పప్పుదినుసుల పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి రైతులను చైతన్య వంతులను చేసేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఏటేటా పప్పు ధాన్యాల పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోతుండడాన్ని పరిశీలిస్తే భవిష్యత్‌లో ఈ పంటలు కనుమరుగయ్యే అవకాశాలు నెలకొన్నాయి.

పెరిగిన పప్పుల ధరలు

కూరగాయల ధరలే కాదు.. పప్పుల ధరలు మండి పోతున్నాయి. కిలో కంది పప్పు రూ:180 నుంచి 190, కిలో పెసరపప్పు రూ:120, కిలో మినపపప్పు రూ.120, కిలో శనగపప్పు రూ:110, కిలో బొబ్బెర పప్పు రూ.120, కిలో ఎర్రపప్పు రూ.100 పలుకుతున్నాయి. పెరిగిన పప్పుల ధరలతో సామాన్యులు పప్పన్నం తినలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

చిరు ధాన్యాలు ఆరోగ్యానికి మేలు

చెన్నారావుపేట, సెప్టెంబరు 14 : చిరు ధాన్యాల ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తాయని అంగన్‌వాడీ టీచర్ అరుణమేరీ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసంలో భాగంగా హ్యాండ్ వాష్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతీ గర్భిణి ఆరోగ్య పరీక్షలను చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశలు రజిత, అనిత, ఉమాదేవి, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట క్షేత్ర పరిశీలన

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 14 : మండలంలోని మహేశ్వరం, మాధన్నపేట గ్రామాల్లోని పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి కృష్ణకుమార్ ఆధ్వర్యంలో అధికారులు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటలో తేమ ఎక్కువ ఉండటం వల్ల కుళ్లు రోగాలు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు 19.19.19 లేదా 13.0.45 ఐదు గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కల్పించి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో అశోక్, శ్యామ్‌రైతులు భాస్కర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడికి నియామకపత్రం అందిస్తున్న జిల్లా బాధ్యులు

పర్వతగిరి, సెప్టెంబరు 14 : పీఆర్‌టీయూ టీఎస్ నూతన మండల కమిటీని శనివారం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్ నేతృత్వంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూక్యా రాములు, ప్రధానకార్యదర్శిగా మేడిది నాగేశ్వర్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పాక కుమార్, ఉపాధ్యక్షుడిగా సాంబారి అనిల్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కల్పన, కార్యదర్శిగా జలందర్, మహిళా కార్యదర్శిగా రాణి రుద్రమ దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హన్మకొండ జిల్లాఅధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, పత్రిక కార్యవర్గ సభ్యుడు రాజు, నల్లబెల్లి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నెక్కొండ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌సింగ్, యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సేవే లక్ష్యం



కేశవాపురంలో విరాళం అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, సెప్టెంబరు 14 : పార్టీలకతీతంగా సేవ చేయడమే లక్ష్యంగా, వివిధ సామాజిక కార్యక్రమాలు చేస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మైలారం, కిష్టాపురం, కేశవపురం, ఎర్రకుంట తండా, వెంకటేశ్వపల్లి, సన్నూరు, పన్యానాయక్ తండాల్లో వినాయక మండల పాల నిర్వాహకులకు నిమజ్జన శోభాయాత్ర ఖర్చుల నిమిత్తం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ పేరిట నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ సంకల్పంతో పాలకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. సంపాదించిన వాటిలో కొంత మేర సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు పెట్టాలన్నదే తన ధ్యేయమని స్పష్టం చేశారు. దివ్యాంగులు, అనాథ పిల్లలు, ఇతర వర్గాల వారికి ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో లేతాకుల సుధాకర్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, నంది అమ్మిరెడ్డి, సురేష్ రాథోడ్ పాల్గొన్నారు.

నీట మునిగిన ఎడ్లబండి

సంగెం, సెప్టెంబరు 14 : వ్యవసాయ పనులకు వెళ్లి వస్తున్న ఎడ్ల బండి నీటిలో మునిగిపోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నార్లవాయి క్రాస్ రోడ్డు వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు మొండ్రాయ-నల్లబెల్లి గ్రామాల మధ్య గల కల్వర్టు కొట్టుకుపోయింది. శనివారం సాయంత్రం మొండ్రాయికి చెందిన పొన్నాల మల్లయ్య వ్యవసాయ బావి వద్ద నుంచి ఎడ్ల బండిపై వస్తుండగా, బండి నీటిలో దిగబడింది. అప్రత్తమైన మల్లయ్య ఎద్దులను బండి నుంచి విడిపించాడు. దాంతో పశువులు ఒడ్డుకు చేరాయి. వెంటనే తోటి రైతులు టాక్టర్ తెప్పించి బండిని నీటినుంచి బయటకు తీశారు.

